మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# హాస్టల్ వర్కర్ల జీతాల తగ్గింపుకు నిరసన



నిరసన తెలుపుతున్న హాస్టల్ వర్కర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్ వర్కర్లకు జీతాలు తగ్గించడంతో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జీవో 64 తెచ్చి ప్రస్తుతము రూ.14,700 వేతనమిస్తుండగా జీవో 64 తీసుకు వచ్చి వేతనాలు 11,700కు తగ్గించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 5వ రోజు సమ్మెలో భాగంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన హాస్టల్ వర్కర్లకు కనీసవేతనలు అమలు పరచాలని, వేతనాలు పెంచాలని పోరాటం చేయాల్సిన పరిస్థితిలో ఉన్న జీతాలు కాపాడుకోవడానికి పోరాటం చేయాల్సిన దురవస్థ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని వారు వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు వేల మంది ఆశ్రమ హాస్టల్లో డైలీ వెజేసు, కాంటినెజెంటు వర్కర్లుగా గత 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, అట్లాంటి వర్కర్లను పర్మనెంట్ చేసి టైం స్కేల్ ఇచ్చి సమాన పనికి సమాన వేతన అమలు చేయాల్సిన ప్రభుత్వాలు, ఉన్న జీతాలపై కోత విధించి ,వారిని రోడ్లపై నెట్టారని వారు తీవ్రంగా విమర్శించారు. ఐదవ రోజు సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా కార్యాలయం నుండి నిరసన ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేస్తూ, సిగ్గు సిగ్గు వేతనాలు తగ్గించడం అని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పర్మనెంట్ చేస్తామని కనీసవేతనాలు అమలు చేస్తామనీ చెప్పిన మాటలకు, ప్రస్తుతం చేస్తున్న విధానాలకు పొంతనలేదని వారు ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. ఇందులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయకులు వి.కురుమూర్తి, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ యాదమ్మ, అంజమ్మలు – మిగతా4లో..

## తెలంగాణ స్వాతంత్ర్యానికి

# 77ఏళ్లు..!

- నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం
- రజాకార్ల రావణకాష్టకు పరాకాష్టగా ఆపరేషన్ పోలో
- పాలమూరులో మరో జులియన్‌వాలాబాగ్ అప్పంపల్లి
- 11మందిపై విచక్షణంగా కాల్పులు జరిపిన రజాకార్లు
- తెలంగాణ విమోచన దినం నేడు

**భూత్పూర్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త :** యావత్ భారత ప్రజానీకానికి స్వాతంత్ర్యం 1947లో వస్తే,నైజాం నిరంకుశ పాలనలో ఉన్న తెలంగాణ ప్రజలకు మాత్రం 1948లో వచ్చింది.దాదాపు 14నెలల అనంతరం తెలంగాణ ప్రజలు స్వేచ్ఛావాయువును పీల్చుకున్నారు. ఎందరో తెలంగాణ అమాయక ప్రజల ప్రాణత్యాగాల ఫలితం,సాయుధ రైతాంగ పోరాటం,తెలంగాణ కవులు,కళాకారుల ప్రబోధగీతాలు,మేధావుల మేల్కొల్పుల కారణంగా తెలంగాణ ప్రజల బానిసత్వ ఘోషణలు ఢిల్లీ వరకు చేరడంతో నాటి దేశప్రధాని పండిత జవహార్‌లాల్ నెహ్రూ ఆదేశానుసారం నాటి ఉపప్రధాని,రక్షణ మంత్రి సర్దార్ వల్లభ్ భాయి పటేల్ మిలటరీ సైన్యంతో చేపట్టిన ఆపరేషన్‌పోలో ద్వారా ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత సైన్యం ముందు లొంగిపోయారు. తెలంగాణ ప్రజలకు 1948 సెప్టెంబర్ 17నభారత రక్షణశాఖ మంత్రి సర్దార్ పటేల్ ఆదేశాల ప్రకారం భారత సైన్యం ముందు తాను లొంగిపోతున్నట్లు నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రకటించడంతో హైదరాబాద్ సంస్థానం,నిజాం స్టేట్‌లో భారత యూనియన్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ కలిపేశారు.స్వాతంత్ర్యం వచ్చింది. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం తెలంగాణ వీరులెందరో తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి అమరులయ్యారు.ఉద్యమాల పురిటిగడ్డగా నల్లగొండ, కరీంనగర్,వరంగల్,పాలమూరు జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయి. నిజాం నవాబులకు తొత్తులుగా ఉంటూ వచ్చిన రజాకార్లు తెలంగాణ తాడిత,పీడిత ప్రాంతాలలో రావణకాష్ట సృష్టించారు.సామాన్య ప్రజల ముఖ్యం గా మహిళల ప్రాణ,మాన,దౌర్జన్యాలతో హింసను ప్రోత్సాహిం చారు.పాలమూరులోని తూర్పుకమాన్,గడియారం చౌరస్తా,దేవరకద్ర నియోజక వర్గం లోని అప్పంపల్లిగ్రామాలు,పట్టణాలు రాజాకార్ల రావణకాష్ట కు పరాకాష్టగా నేటికి ఇవి సజీవ సాక్ష్యంగా నిలిచాయి.దేశ స్వాతంత్ర్యం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అప్పంపల్లి గ్రామానికి చెందిన బెల్లం నాగన్న నేతృత్వంలో మరో పది మంది ఇతర గ్రామస్తులు తంగేడిరాంరెడ్డి,లక్ష్మారెడ్డి,బాల్‌రెడ్డి,కుర్మన్నఈశ్వరన్న, నాగన్న,కిష్టన్న,తిమ్మన్న,గజ్జెలన్న, నర్సన్న – మిగతా4లో..

# విద్యకు ప్రాధాన్యత

- గురుకుల విద్యార్థినీలతో కలిసి ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే సహపంక్తి భోజనం
- గురుకుల పాఠశాలలో నూతన వసతులు, నాణ్యమైన భోజనం
- చదువు కోసం ప్రభుత్వం కృషి
- విద్యార్థులతో ఎంపీ మల్లు రవి, కలెక్టర్, ఎమ్మెల్యే మాట ముచ్చట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:**నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో ఎస్బిఐ బ్యాంక్ సౌజన్యంతో 6.70 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మూత్రశాలలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డిలతో కలిసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ప్రారంభించారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో స్టోర్ రూమ్‌ను ఎంపీ మల్లురవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,ఎమ్మెల్యే కలిసి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న రోజువారి మెను చార్టును కూడా వారు పరిశీలించి, ఆహార నాణ్యతపై వివరాలు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వివరించారు. బీసీ వెల్ఫేర్ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల విద్యార్థినిలతో కలిసి ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే సహపంతి భోజనం చేస్తూ వారితో ముచ్చటించారు. అనంతరం విద్యార్థులతో ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందని, అందుకు అనుగుణంగానే మెస్ చార్జీలను 40 శాతం పెంచామని, గ్రూపులలో చదివే విద్యార్థులకు మెరుగైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని,విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ మల్లు రవి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో వసతులను కల్పించేందుకు కృషి చేస్తానని ఎంపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మంచి వాతావరణంలో చదువుకునే అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకొని రాణించాలని, ప్రతిభతో జిల్లాకు గౌరవం తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు చదువుపైనే పూర్తి ధ్యాస ఉంచాలని ఎంపీ విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని తెలిపారు. విద్యాభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఈ దృష్టితోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు అని అన్నారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాలల్లో నిర్మాణాలు, మరమ్మతుల కోసం ఎంపీ మల్లు రవి కృషి చేస్తున్నందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తమ చదువులను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఎంపీ మల్లు రవి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చేందుకు తన నిధులే కాకుండా సిఎస్ఆర్ నిధులను సమకూర్చి గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ మల్లు రవి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి అధ్యక్షులు మావిళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఎల్ డి ఎం చంద్రశేఖర్, యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మూర్తి, బ్యాంక్ అధికారులు, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ, కలెక్టర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## రాజకీయాలు కాదు..

# విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం

- సివిల్స్ టాపర్ అనన్య రెడ్డిలా రాణించాలి
- సెల్‌ఫోన్లు,టీవీలు కట్టిపెట్టండి
- ఐదారునెలలు బిడ్డల భవిష్యత్తు కోసం త్యాగం చేయండి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు16,ప్రభాతవార్త :** రాజకీయాల కంటే విద్యార్థుల భవిష్యత్తే తనకు ప్రధానం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శతశాతం కార్యక్రమానికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మహబూబ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఆత్మీయసమ్మేళనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు ఐదు సంవత్సరాలు మీ పిల్లల చదువుపట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.కాటికి చేరే వరకు మనం గర్వంగా జీవించేలా మన పిల్లలను మనం తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మీపిల్లల భవిష్యత్తు కోసం ప్రతిరోజూ పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత దయచేసి టివిలు,సెల్ ఫోన్‌లను కట్టి పెట్టాలని ఆయన సూచించారు.మీరు చేసే చిన్న త్యాగమే మీ పిల్లలను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు.తల్లిదండ్రుల కృషి లేనిదే ఎవరూ ఉన్నత శిఖరాలకు చేరుకోలేరన్నారు. అందుకు ఉదాహరణ బ్యాట్మెంటన్ క్రీడాకారిణి పివి సింధు అని, ఆమె బ్యాట్మెంటన్ లో ప్రపంచ స్థాయిలో రాణించిందంటే వారి తల్లిదండ్రులు చేసిన త్యాగం,కృషి తెరవెనుక ఎంతో ఉందన్నారు. మన పిల్లలు మన మహబూబ్‌నగర్‌లోనే చదువుకోవాలనే ఉద్దేశంతో గత 20 నెలలోనే మన మహబూబ్‌నగర్ లోని పాలమూరు యూనివర్సిటీ లో కొత్తగా ఇంజనీరింగ్, లా కళాశాల తెచ్చామని – మిగతా4లో..



రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# యూరియా తిప్పలు..

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** రైతులకు సరిపడ్డ యూరియాను అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూసరిపడ్డా యూరియాను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అన్నం పెట్టే అన్నదాతకు కష్టాలు తప్పడం లేదన్నారు. చేసేది లేక రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, యూరియా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రైతుల డిమాండ్ ప్రకారం అవసరమున్న హీరోయిన్ వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో విఫలమైందన్నారు. ధర్నాకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, పిడిఎస్ యు, టియుసిఐ, నాయకులు మద్దతు తెలియజేసి మాట్లాడారు. ధర్నా కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు కించే నారాయణ, బి నరసింహ, సాయికుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ టీచర్ల సమస్యను

# అసెంబ్లీలో లేవనెత్తుతా..

- ఫీజులు ఎక్కువ.. టీచర్లకు జీతాలు తక్కువ
- ఫీజులు తగ్గించి పేద విద్యార్థులను ఆదుకోవాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



టీచర్లకు అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబర్ 16,ప్రభాత వార్త :** ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులు ఎక్కువగా ఉంటాయని, అయితే ఆ పాఠశాలల్లో పని చేసే టీచర్లకు మాత్రం జీతాలు చాలా తక్కువగా ఉంటాయని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రైవేటు టీచర్ల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని వారి సమస్యలను అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. మార్కులు తక్కువ ఉంటే ఎవరు సిఫార్సు చేసినా ట్రిపుల్ ఐటీలో సీట్లు రావని, అందుకే విద్యార్థులు కష్టపడి చదివి మార్కులు తెచ్చుకోవడం ద్వారా ట్రిపుల్ ఐటీని సద్వినియోగం చేసుకోవాలని హితవు చెప్పారు.మంగళవారం జడ్చర్ల కేంద్రంలోని చంద్ర గార్డెన్ లో నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు రిళిళీలీతి అవార్డు ప్రదానోత్సవ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగానే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ గురువే గోవిందుడు – ఉపాధ్యాయుడే భవిష్యత్తుకు మార్గదర్శి. ఒక వైద్యుడు ఒక్క రోగిని కాపాడతాడు, ఒక ఇంజనీరు ఒక్క ప్రాజెక్టు నిర్మిస్తాడు కానీ ఉపాధ్యాయుడు ఒక తరాన్ని తీర్చిదిద్దుతాడని కితాబిచ్చారు. టీచర్లు అందిస్తున్న జ్ఞానం వల్లే సమాజం అభివృద్ధి దిశగా సాగుతోందని చెప్పారు. జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలో యజమాన్యాలు పేద విద్యార్థులకు ఫీజులను తగ్గించి అందరూ చదువుకొనేందుకు అవకాశం ఇవ్వాలని అనిరుధ్ రెడ్డి కోరారు. అధిక ఫీజులతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలను పెంచి వారిని ఆదుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ సమస్యలకు సంబంధించి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అవకాశంవస్తే మాట్లాడుతా నని తెలిపారు.విద్యార్థులు పదవతరగతిలో ఉత్తమఫలితాలను సాధిస్తే జడ్చర్ల సమీపంలో ఉన్న ట్రిబుల్ ఐటీ పాఠశాలలో చదువుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. రాబోయే దసరానవరాత్రి ఉత్సవాలను అందరితో కలిసి ఘనంగా నిర్వహించు కోవడానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నామని,దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తానని చెప్పారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ తంగేళ్ల జ్యోతి, స్థానిక కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భర్తపై దాడి చేసిన భార్య

- వేడి నూనె పోయడంతో
- చికిత్సపొందుతూ భర్త వెంకటేష్ మృతి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



భార్యాభర్తల పద్మా వెంకటేష్ (ఫైల్ ఫోటో)

**మల్దకల్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** కుటుంబ తగాదాలే కారణం మల్దకల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం,మల్లెందొడ్డి గ్రామంలో నిద్రిస్తున్న భర్త వెంకటేష్ పై వేడినూనే పోసిన భార్య పద్మ.గత 8 సంవత్సరాల క్రితం వెంకటేశ్ పద్మలకి వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.వివాహం అనంతరం భార్య,భర్తలు తరుచుగా గొడవ పడేవారని అందులో భాగంగా ఈ నెల 11వ,తేది ఉదయం 5గంటల సమయంలో నిద్రిస్తున్న భర్త వెంకటేష్‌పై భార్య పద్మ వేడినూనె పోసింది. వెంకటేష్ కు తీవ్ర గాయాలు కాగ గద్వాల ఆసుపత్రి తరలించగా పరిస్థితి విషమించడంతో డాక్టర్లు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.అక్కడ చికిత్స పొందుతు సోమవారం సాయంత్రం వెంకటేష్ మరణించడం జరిగింది.ఈనెల 11వ తేదిన సంఘటన జరిగిన రోజు భార్య పద్మను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం పద్మను రిమాండ్ కు తరలించడం జరిగిందని మల్దకల్ ఎస్ఐ నందికర్ తెలిపారు.



గాయాల పాలైన విద్యార్థులు

## నలుగురిపై 30 మంది

# విద్యార్థులు దాడి

**దేవరకద్ర, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటనలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన సం ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులలో కొంత మంది చెడు అలవాట్లకు గురి అయ్యారని సమాచారం. ఈ విషయంపై తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారనే భయంతో వారిని భయభ్రాంతులకు గురి చేయాలనే ఉద్దేశంతో ఆదివారం అర్ధరాత్రి సమయంలో తలుపులు మూసి నలుగురు విద్యార్థులపై దాడికి దిగారు. ఈ సంఘటనలో బాధిత విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. మరుసటి రోజు సోమవారం విద్యార్థుల శరీరాలపై గాయాలను గమనించిన వంట మనిషి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఘటనపై పూర్తిగా ఆరా తీశారు. అలాగే గాయపడిన విద్యార్థులకు స్థానికంగా – మిగతా4లో..

# గండీడ్ మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

- గురుకుల పాఠశాల, అంగన్ వాడి కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విజయేందిర బోయి



పగిడియాల గ్రామంలో పల్లె దవాఖానను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

**గండీడ్ సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** గండీడ్ మం డల కేంద్రంలోని ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహం, గిరిజన సంక్షేమ శాఖ మినీ గురుకుల పాఠశాలను, పగిడియాల గ్రామంలోనీ హెల్త్ సబ్ సెంటర్, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ బి.సి. బాలుర వసతి గృ హం అదనపు తరగతి గదులు అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయుటకు అంచనాలు రూపొం దించి పంపించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.వసతి గృహంలోనీ వంట గది, స్టోర్ రూమ్, డార్మిటరీనీ పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం పక్కనే అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు నిర్మించి అసంపూర్తిగా వదిలివేసిన భవనంను కలెక్టర్ పరిశీలించారు. 2017 సంవత్సరంలో అదనపు తరగతి గదులను నిర్మించి ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్ తదితర పనులు పూర్తికాక అసంపూర్తిగా మిగిలి ఉన్నాయని బి.సి. అభివృద్ధిఅధికారిని కలెక్టర్‌కు వివరించారు. అసంపూర్తి పనులు పూర్తిచేయుటకు అంచనా ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలో గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం కు వండిన భోజనాన్ని పరిశీలించి పప్పు, చారు ఒకటే లాగా ఉంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం మెనూ ప్రకారం అల్పాహారం అందించారా ? అని కలెక్టర్ అడగగా మెనూ ప్రకారం ఉదయం ఇడ్లీ కి బదులుగా టమాటా రైస్ పెట్టారని హెడ్ మాస్టర్ వివరించారు. ఇడ్లీ పిండి లేనందున సరఫరా కానందున టమోటా రైస్ పెట్టినట్లు తెలిపారు.పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని, ఐదవ తరగతి గదిలోకి వెళ్ళి పాఠశాలలో బోధన, కల్పిస్తున్న మౌలిక వసతులు, అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనంపై విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. హెల్త్ చెకప్ గురించి వాకబు చేశారు. టాయిలెట్స్ ఉన్నాయా?అడిగి తెలుసుకున్నారు. హాస్టలను ఎం.పి.డి. ఓ. పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు.గండిడ్ మండలం పగిడియాల గ్రామంలో పల్లె దవాఖాన, ఆయుష్ ఆరోగ్య మందిరంను, అంగన్వాడి కేంద్రంలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖాన సందర్శించి ఆశా వర్కర్స్ తో పల్లె దవాఖాన పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి. ఈ.డి.డి, ఓ.పి నమోదు పరిశీలించారు.గర్భిణీలు, మాతా శిశు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. మాతా, శిశు సంరక్షణ, గర్భిణీ స్త్రీల చెకప్, హైరిస్క్ కేసుల చికిత్స తదితర అంశాలపై వారికి అవగాహన కలిగించాలన్నారు. అంగన్వాడీ.1,2 లలో మొత్తం ఎంతమంది పిల్లలు ఉన్నారని తెలుసుకుని రెండు అంగన్వాడి కేంద్రాలు ఒకే చోట నిర్వహణ గురించి పరిశీలించి సూచనలు చేశారు.గర్భిణీ స్త్రీలు ఎంతమంది ఉన్నారు? వాళ్లకు ఈ రోజు గుడ్లు పెట్టారా? అని అడిగారు. పిల్లలకు, గర్భిణీ , బాలింతలకు పౌష్టిక ఆహారం, గుడ్లు సక్రమంగా అందచేయాలని, వారి బరువు, ఎత్తు పర్యవేక్షణ చేయాలని, అంగన్వాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు.

## చనిపోయిన వ్యక్తికి

# ఉపాధి కూలి

**మొక్కుబడిగా సామాజిక తనిఖీ.. ప్రజలు లేకుండానే ప్రజా వేదిక**

**బిజినపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో చనిపోయిన వ్యక్తికి ఉపాధి కూలీ చెల్లించడం, చేపట్టిన పనుల్లో అవకతవకలు, సిబ్బంది రికార్డుల నిర్వహణ లోపం సామాజిక తనిఖీ వేదిక ద్వారా వెలుగులోకి వచ్చాయి. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 15 వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. డీఆర్డీఓ ఏపీడీ రాజేశ్వరి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 2024 సెప్టెంబరు 1 నుంచి 2025 సెప్టెంబరు 15 వరకు మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ ఉపాధి హామీ పనులపై నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.3,36,98, 881 కోట్లు ఖర్చు – మిగతా2లో..



కేవలం అధికారులు మాత్రమే హాజరైన ప్రజా వేదిక

(ఇన్‌సెట్లో ) ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా వేదిక

## శాంతినగర్‌లో ఘనంగా ప్రపంచ క్షవర వృత్తిదారుల దినోత్సవం

**వడ్డేపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన శాంతినగర్ పట్టణంలో మంగళవారం ప్రపంచ క్షవర వృత్తిదారుల దినోత్సవం పట్టణ నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు ఎం.అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు దస్తగిరి హాజరై ప్రసంగించారు. కులదైవం ధన్వంతరి జన్మ దినోత్సవం సందర్భంగా చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని కోరారు. ఉచిత విద్యుత్, బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇతర కులాల వారు ఈ వృత్తి లోకి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిన్న రామకృష్ణ, జిల్లెడుదిన్నె వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, దస్తగిరి, నరసింహులు, వసంతు, రాముడు, రాజేష్, బీచుపల్లి, పెద్ద రామకృష్ణ, బాలరాజు, తిప్పన్న తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రపంచ క్షవర వృత్తిదారుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## ఉప్పరపల్లిలో ఘనంగా సవరమ్మ తల్లికి బోనాలు

**ఖిల్లా గణపురం సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో మంగళవారం సవారమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఘనంగా బోనాలతో నైవేద్యం సమర్పించారు. ప్రతి మంగళవారం అమ్మవారికి బోనాలతో పాటు పొట్టేలు మేక పిల్లలతో బలి ఇచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారని. పూర్వం ఈ గ్రామంలో వింత వ్యాధితో పలువురు మృత్యువాత పడటంతో సవరమ్మ తల్లి అమ్మవారి ఆదేశాల మేరకు అమ్మవారిని ప్రతిష్టాపన చేసి పూజలు జరిపించడంతో గ్రామానికి మంచి జరిగిందని అప్పటినుంచి అమ్మవారికి ఏడాదికి ఒకసారి బోనాలు వెళ్ళడం ఆనవాయితీగా వచ్చిందంటున్నారు గ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నది ఉప్పరిపల్లి గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.


సవరమ్మ తల్లికి బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని శ్రీ హంసవాహిని పాఠశాలలలో మంగళవారం పాలమూరు కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ శశి సహకారంతో పిల్లల్లో కంటి శుక్లము, పొర, కంటి లూటీ సమస్యలను గుర్తించి శాస్త్ర చికిత్సలు చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రియంబర్స్ మెంట్, టిఫిఏ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు దారులకు నగదు రహిత చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అంజి, దివ్య, దర్శన, పాఠశాలల ప్రిన్సిపాల్ రాజేష్ కుమార్, ఉపాధ్యాయులు నమ్రత, అమల విజయ షమీనా, ఉషారాణి పాల్గొన్నారు.

## క్రీడాకారులకు గ్రామస్తుల చేయూత

**ఉప్పునుంతల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూర్ గ్రామంలో జిల్లాస్థాయి 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలో ఎంపికైన క్రీడాకారులు రెండవ రోజైన మంగళవారం హై స్కూల్ ఆవరణలో శిక్షణ పొందారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తమ వంతుగా వారికి భోజనం సౌకర్యాల్లో భాగంగా తాము చేయూత అందిస్తానని ముందుకు వచ్చి శిక్షణ శిబిరంలో ఉన్నవారికి భోజన వసతి కల్పించారు. శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న కబడ్డీ క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన సందీప్ రెడ్డిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్టూరు ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, విద్యార్థులు, క్రీడాకారులు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సన్మానించిన వారిలో హెచ్ ఎం.అంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, ఆ పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, జ్యోతి, జంగయ్య, గ్రామ యువకులు గుద్దటి బాలరాజు, ఉప్పరి బాలరాజు, సమ్మద్, రాము, నాగరాజు, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రఫీ కొత్త తరహా సాంకేతికతలకు వేదికగా ఎక్స్ పో 2025

**ఊట్కూర్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21 తేదీలలో జరగనున్న ఫోటో ట్రెండ్ ఎక్స్ పో 2025 పోస్టర్‌ను ఉట్కూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉట్కూర్ ఎస్.ఐ రమేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రమేష్ మాట్లాడుతూ -“ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి ఎక్స్ పోలు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయి. ఆధునిక కెమెరాలు, డ్రోన్స్, ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లు, కొత్త తరహా లైటింగ్ పరికరాలు వంటి సాంకేతికతలను ఒకే వేదికపై పరిచయం చేయడం ఫోటోగ్రఫీ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరికీ మేలు చేస్తుంది” అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎడిట్ వీడియో గ్రాఫ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎక్స్ పో నిర్వహించబడనుంది. ఫోటోగ్రఫీపై ఆసక్తి కలిగిన విద్యార్థులు, యువత, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్లు తప్పక పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన

**నవాబుపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారంగా జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. శశికాంత్ ఆధ్వర్యంలో వెన్నెల కల్చరల్ అకాడమీ కళాకారులు మంగళ వారం సాయంత్రం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా పరిధిలోని ఎన్మన్ గండ్ల జూనియర్ కళాశాలలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణపై కళాకారులు తమ ఆటపాటలతో కళా ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ ప్రదర్శనలో కళాకారులు పల్లె శుద్ధుల ద్వారా ప్రజలకు హెచ్ఐవి పట్ల హెచ్ఐవి సోకే మార్గాలను వివరించారు. హెచ్ఐవి కలుషిత సూది సిరంజిల ద్వారా కలుషితమైన రక్తమార్పిడి ద్వారా అసురక్షిత లైంగిక సంబంధాల వల్ల హెచ్ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు సోకుతుందని అవగాహన కలిగించారు. హెచ్ఐవి రాకుండా యువతి యువకులు పెళ్లికి ముందు బ్రహ్మచర్యం పాటించాలని పెళ్లి తర్వాత భార్యాభర్తలిద్దరూ ఒకరిపై ఒకరు నమ్మకంగా జీవించాలన్నారు. అనుకోని పరిస్థితుల్లో అసురక్షిత లైంగికంగా పాల్గొనాలంటే కండోమ్ వాడాలని సూచించారు. హెచ్ఐవి పట్ల ఏమైనా అనుమానాలు ఉంటే 1097 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి అనుమానాలు తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెల కల్చర్ల అకాడమీ డైరెక్టర్ రవిశంకర్, నరసింహ, చెన్నయ్య, వెంకటేష్, ఝాన్సీ, ఎంపీడీవో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నోవా లక్ష్మి, రేచల్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కురుమూర్తిలో కృష్ణాష్టమి వేడుకలు

**చిన్న చింతకుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి ఉట్ల వేడుకలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాదవ కులస్తులు ఉట్లు కొట్టే కార్యక్రమం వైభవంగా జరిపించారు .ఎలిగండ్ల గ్రామానికి చెందిన భక్తుడు సుతారి రాములు 80 వేల రూపాయల విలువచేసే టేకు చెక్కతో స్వామివారికి పల్లకి సేవను అందించారు. ఈ పల్లకి సేవను వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తుడు సుతారి రాములును పాలకమండలి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం ఎంతో ఉందని, ఆలయం తరపున దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పల్లకి సేవలో పాల్గొన్న చైర్మన్ తదితరులు

# యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు

**ఉప్పునుంతల,సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** యూరియా బస్తాల కోసం రైతులు పదరాన్ని పాట్లు పడుతున్నారు. గత నెల రోజుల నుంచి మండల కేంద్రమైన ఉప్పునుంతలలో స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, మన గ్రోమోర్, రైతు ఆగ్రో సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ ఆధ్వర్యంలో యూరియా అందజేస్తున్నారు. రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి యూరియా బస్తాల కోసం పదరాని పాట్లు పడుతున్నారు. మండల కేంద్రానికి యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు నిద్ర నుంచి లేచి వేకువజామున కేంద్రాల వద్దక్యూలు కడుతున్నారు. మండల వ్యవసాయ అధికారి రైతులు క్యూ లైన్‌లో ఉండకుండా సంబంధించిన కాగితాలను సేకరించి వరుస వారిగా పేర్లను పిలవడంతో రైతులు యూరియా బస్తాలు తీసుకొని వెళ్తున్నారు. మంగళవారం మన గ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు భారీ ఎత్తున తరలివచ్చారు. అచ్చంపేట,ఉప్పునుంతల ప్రధాన రహదారిలో మన గ్రోమోర్ కేంద్రం ఉండడం రద్దీగా ఉన్న ఈ మార్గంలో భారీ ఎత్తున రైతులు తరలిరావడం తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. విషయం తెలుసుకున్న ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. యూరియా కొరతకు ఏంటో తెలియదు గానీ రైతులు మాత్రం ఎక్కడ యూరియా దొరుకుతుందో లేదో అని సాంప్రదాయ పడుతున్నారు. రాజకీయ నాయకులు ఎన్ని చెప్పినా తెలియదు గానీ రైతులకు మాత్రం యూరియా కోసం పదరాన్ని పాట్లు పాడుతున్నారు. ఈ మండలంలో అధికంగా మొక్కజొన్న సాగు చేసుకున్నారని మొక్కజొన్న పంటను రక్షించుకోవడానికి యూరియా అవసరమని రైతులు వాపోతున్నారు. గతంలో మొక్కజొన్న పంట సాగు తక్కువగా ఉన్నందున వరి సాగుకు యూరియా అంత అవసరం లేదని రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా గ్రామాలలో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి ఇంత ఇబ్బంది లేకుండా చేస్తే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ఉప్పునుంతలలో మన గ్రోమోర్ వద్దకు భారీ సంఖ్యలో తరలి వచ్చిన రైతులు

### రైతులు ఆందోళన చెందవద్దు

రైతులందరికీ యూరియా అందుతుంది

మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ రైతులు యూరియా గురించి ఎటువంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ అన్నారు. మంగళ వారం మండల కేంద్రమైన ఉప్పునుంతల మన గ్రోమోర్‌వద్ద యూరియా పంపిణీ చేయడం జరిగిందని,ప్రతి రైతుకు యూరియా అందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. రైతులు ఆందోళనతో విక్రయ కేంద్రాల వద్దకు వచ్చి హంగామా చేస్తున్నారు. అది మంచి పద్ధతి కాదని,సామరస్యంగా తమ రైతుపాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసిన వారి పేర్లు పిలుస్తారని ఎంత చెప్పినా వినకుండా ఆందోళన చేయడం సరికాదన్నారు.

# విధుల్లో చేరిన జీపిఓలు

### రెవెన్యూ అక్రమాలకు అడ్డుకట్టపడేనా ?

**బాలానగర్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం హైదరాబాదుకు దగ్గరగా ఉండడం, జాతీయ రహదారి మండలంలోని పలు గ్రామాల మీదుగా వెళ్లడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వోలను తొలగించడంతో గ్రామాలలో భూ అక్రమార్కులకు అడ్డు లేకుండా పోయింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాకు గురై, ప్రైవేటు వ్యాపారస్తుల చేతిలోకి వెళ్లిపోయాయి. గ్రామాలలో విఆర్వో వ్యవస్థ లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పాలన అధికారులను నియమిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు20నెలల తర్వాత ఇటీవలే గ్రామ పాలన అధికారులను నియమించింది. బాలానగర్ మండలంలో 12 క్లస్టర్లుగాను,7 క్లస్టర్‌లకు ప్రభుత్వం గ్రామపాలన అధికారులను నియమించింది. బాలానగర్ మండల కేంద్రానికి రాఘవేందర్, కేతిరెడ్డిపల్లి గ్రామానికి నాగరాజు, నేరెళ్లపల్లి గ్రామానికి ఎం.డి. మునీర్, పెద్ద రేవల్లి, హేమాజీపూర్ గ్రామాలకు రమేష్, బోడ జానంపేట గ్రామానికి రవీందర్, మోతీ ఘనపూర్ గ్రామానికి జి.రమేష్, చిన్న రేవల్లి గ్రామానికి యాదగిరిని నియమించినట్లు, నాలుగు రోజుల్లో మరో ఐదుగురు జీపిఓలు విధుల్లో చేరనున్నారని తహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జీపిఓల రాకతో గ్రామాలలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కాపాడుకోవచ్చు అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


విధుల్లో చేరిన జీపిఓలు

# సింగిల్ విండో ఫర్టిలైజర్ గోదాము తనిఖీ చేసిన అధికారి

**అయిజ సెప్టెంబర్ 15,ప్రభాతవార్త;** జిల్లా వ్యాప్తంగా నెలకొన్న యూరియా కొరత దృష్ట్యా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ మంగళవారం స్థానిక వ్యవసాయ సహకార సంఘం(సింగిల్ విండో) గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిజ మండలంలో ఆర్డీఎస్ కెనాల్, బోర్ల కింద విస్తారంగా వరి పంట సాగయిందని దీనికి రైతులు ఎక్కువ శాతం యూరియానే వినియోగించడం వల్ల యూరియా తాత్కాలిక కొరత ఏర్పడిందని ఆయన అన్నారు. సింగిల్ విండో సిబ్బంది రైతులకు ఇబ్బంది కలగకుండా యూరియా సరఫరా చేస్తున్నడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఇబ్బందులు ఉన్నా జిల్లా యంత్రాంగం ఈ ప్రాంత రైతులకు యూరియా సరఫరా చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తుందని ఆయన అన్నారు మండలంలో యూరియా స్టాక్ వచ్చిన ప్రతిసారి టోకెన్ ద్వారా ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకుండా నేరుగా రైతులకు యూరియా ఇస్తున్నామని ఆయన వివరించారు. వచ్చే రబీ సీజన్లో కూడా యూరియా కొరత ఇలానే ఉంటుందనే అపోహతో రబీలో సాగు చేసే మొక్కజొన్న తదితర పంటలకు అవసరం లేకున్నా రైతులు యూరియా కొనుగోలుచేస్తున్నారని,దీనివల్ల కొంతఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన వివరించారు.ఎన్ని ఒత్తుడులు వచ్చినా రైతులకు ఇబ్బంది కలక్కుండా వచ్చిన యూరియా స్టాకును నేరుగా అది కూడా వ్యవసాయ, పోలీస్ అధికారుల సమయంలో రైతులకు అందిస్తున్నామని సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ కింద ఉన్న రైతులే ఎక్కువగా వస్తున్నారని, వారు వేయాల్సిన మూడవ కోట కాంప్లెక్స్, యూరియా ఎరువులు వేసే దశ పూర్తవుతున్నదని, త్వరలో ఒత్తిడి తగ్గి యూరియా ఫ్రీగా లభ్యమయ్యే పరిస్థితి వస్తుందని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ అన్నారు.



స్టాక్ రిజిస్టర్ ను తనకి చేసిన జిల్లా వ్యవసాయ అధికారి

# మండల స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలు ప్రారంభం

**చిన్నచింతకుంట,సెప్టెంబరు16 ప్రభాతవార్త:**మండలంలోని లాల్‌కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి అండర్17 క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి.మండలవిద్యాశాఖ మరియు మండలవిద్యాధికారి మురళీకృష్ణ సూచనలకు అనుగుణంగా మండల వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహణలో కబడ్డీ ,వాలీబాల్, ఖోఖో పోటీలకు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలబాలికలు దాదాపు 500మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అండర్ 17 బాలికల విభాగంలో ఖోఖో పోటీలలో కేజీబీవీ (సీసీకుంట) బాలుర విభాగంలో (మహాత్మ జ్యోతిరావు పూలే) విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. బాలికల విభాగంలో కబడ్డీ పోటీలలో జెడ్పిహెచ్ఎస్ (లాల్‌కోట) బాలుర విభాగంలో ఎంజెపి (సిసి కుంట) ప్రథమ బహుమతి సాధించారు. వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో (ఎంజెపి) ,బాలికల విభాగంలో (కస్తూరిబా గాంధీ) విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల నిర్వహణ కమిటీ వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేందర్, శ్రీనివాసులు, రాఘవేందర్, ప్రసన్న, మమత మల్లేష్, రాజు తెలిపారు. బుధవారం కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తామని వారు తెలిపారు. తదుపరి పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం కూడా ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాయకులు తెలుగు వెంకటేష్, వెంకటేష్ తోపాటు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ గంగయ్య, రాజశేఖర్, ఈశ్వరయ్య, శివకుమార్, సిఆర్‌పి విజయసింహ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకున్న నరేందర్ రెడ్డి

# కాంగ్రెస్ నాయకులకు సమస్యలు కనిపించవా..?

**రహదారులు, తాగునీరు, కరెంటు**

**సమస్యలను పరిష్కరించాలి : మండల బీజేపీ, బీఆర్ఎస్**

**కృష్ణ, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై విపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలో మంగళవారం మండలంలోని వివిధ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్డుపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన బీజేపీ మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, జాతీయ కౌన్సిల్ సభ్యులు అమర కుమార్ దీక్షిత్, బీఆర్ఎస్ యువ నాయకులు శివరాజ్ పాటిల్ ఉమ్మడి రాష్ట్రంలో అణచివేతకు గురైన క్రిష్ణ మండలం తెలంగాణ సాధించిన తర్వాత కూడా కృష్ణ మండలం ఏర్పడి 9 సంవత్సరాలు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని మండల ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా మారాయని కనీసం ప్రభుత్వం తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు సొంత భవనాలు కూడా ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. కృష్ణ మండలానికి ఆనుకుని రెండు నదులు ప్రవహిస్తున్నా తీవ్ర త్రాగునీటి సమస్య ఉందని నీటి సౌకర్యం కల్పించే విధంగా ప్రభుత్వాలు ఎందుకు చర్యలు చేపట్టలేదని సర్కారును దుయ్యబట్టారు. మండలంలో గత 30 సంవత్సరాల క్రితం రైతుల నుంచి శేషాద్రి పవర్ ప్లాంట్ కంపెనీ నిర్మాణం కొరకు తీసుకున్న భూములను వెంటనే ఆ భూములు కోల్పోయిన రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వై.శివప్ప, మాజీ ఎంపీటీసీ అబ్దుల్ ఖాదర్, దండు రాఘవేంద్ర, డీకే కిష్టప్ప, శంకర్ నాయక్, మహాలింగ, మ్యాకల్ బీమ్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నాయకులు


విజయం సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పారిజాత, పీఈటీలు

## ఎస్‌జిఎఫ్ క్రీడల్లో టీఎంఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**జడ్చర్ల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ బాలుర, జడ్చర్ల విద్యార్థులు ఇటీవల జరిగిన ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరచి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు. తమ ప్రతిభ, జట్టు భావన, పట్టుదలతో మెరిసిన ఈబృందాలు పలు విభాగాల్లో విజయాలు సాధించాయి. ముఖ్యంగా అండర్17 వాలీబాల్‌లో విజేతలుగా, అండర్14 కబడ్డీలో రన్నరప్‌గా నిలిచారు. విజేతలను అభినందించిన ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు విద్యార్థుల కృషిని ప్రశంసించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నిర్వహణ కమిటీ ఈ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి విజయాలు మరిన్ని విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొంది.ఈ విజయం జడ్చర్ల టీఎంఆర్ స్కూల్ ప్రతిష్టను మరింతగా పెంచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పారిజాత, పీఈటీలు ఖాజాఖాన్, శివప్రసాద్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## లారీని ఢీకొన్న కారు

**ఇద్దరికీ స్వల్ప గాయాలు**

**పెబ్బేరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం నేషనల్ హైవే రోడ్డుపై మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళుతున్న క్రమంలో షిఫ్ట్ కారు టీఎస్ 07 కేజీ 7317 కారు ముందర వెళుతున్న లారీ ఎన్ఎల్ 01 ఏఈ 5123 లారీని షిఫ్ట్ కారు ఓవర్ స్పీడ్‌గా వెళుతున్న క్రమంలో కంట్రోల్ తప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ కింద కారు ఇరుక్కుని ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించామని ప్రమాదం జరిగిన సమయంలో బెలూన్స్ ఓపెన్ కావడం వల్ల స్వల్ప గాయాలతో బయట పడ్డారని కారులో ప్రయాణిస్తున్న నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసులు తెలియజేశారు.

## మొదటి విడత బిల్లు మంజూరు

**సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు**

**పెబ్బేరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం తోమ్మలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి మొదటి విడత లబ్ధిదారులు అంజనమ్మ,బోయ పద్మావతి,సందు వెంకటమ్మ, ఈడిగ నీలమ్మ, అలివేల,ముష్టిగొల్ల పద్మమ్మకి ప్రభుత్వం తరపున మంజూరైన మొదటి ఇందిరమ్మ ఇంటి బిల్లును అందుకున్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికి లక్ష రూపాయల చొప్పున ఏడు మందికి ఏడు లక్షలు మొదటి విడత మంజూరు కావడం జరిగింది. ఇందిరమ్మ ఇంటి లబ్ధి దారు మాట్లాడుతూ వనపర్తి శాసనసభ్యుడు తుడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇల్లు లేని తమకు మొదటి విడతలో ఇండ్లుమంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, రామన్ గౌడ్, శ్రీనివాసులు, రంగన్న యాదవ్, కె.రాముడు, అశోక్, ఉమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుల్ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ పదవి బాధ్యతలు స్వీకరించి ఏడాదికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో మహేష్ కుమార్ గౌడ్‌కు పూల బొకేతో శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో టిపి ఆర్టియు వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**ఆత్మకూర్ సెప్టెంబర్ 16, ప్రభాతవార్త;** ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామ శివారులో గల కృష్ణానది ఒడ్డుపై మంగళవారం రోజు గుర్తు తెలియని శవాన్ని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లుగా ఆత్మకూరు ఎస్సై నరేందర్ విలేకరులకు తెలిపారు. జూరాల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది బురుజు భీమన్న కృష్ణానది ఒడ్డున గుర్తు తెలియని శవం అస్తిపంజరం ఉందంటూ పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఆత్మకూరు నుండి పోలీసు సిబ్బందితో తరలివెళ్లి శవాన్ని స్వాధీనం చేసుకోవడమే కాకుండా భృతి బీభన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లుగా ఎస్సై తెలిపారు.

## ఓ 3 ఆకారంలో కూర్చుని అబ్బురపరిచిన విద్యార్థులు

**పెబ్బేరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం వైశాఖపూర్ గ్రామంలో జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16వ తారీఖున అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహిస్తారని ఓజోన్ పొర క్షీణతతో వాతావరణంపై పడే ప్రభావం గురించి ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన, సంరక్షణ చర్యలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ఓజోన్ పొర ఆకృతిలో కూర్చుని విద్యార్థులు అబ్బుర పరిచారు.ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన వ్యక్తికి ఉపాధి కూలి

మొదటి పేజీ తరువాయి భాగం

చేయగా కూలీలకు రూ. 3,16,31,869 సామాగ్రికీ రూ. 20,67,012 పంచాయతీ రాజ్ ఖర్చు రూ.2,74,01,363 చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్ కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు, అర్హతలేని వారికి పని కల్పించి మస్టర్లు వేసి వేతనాలు చెల్లించడం, ఉపాధి పనులకు సంబంధించిన బోర్డు లేకపోవడం, హరితహారంలో నాటిన మొక్కలు పని ప్రదేశంలో లేకపోవడం, వంటి తప్పిదాలు వెలుగు చూశాయి. దీంతో పలు గ్రామ పంచాయతీల్లో రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రజా వేదికలో క్వాలిటీ కంట్రోల్ అధికారి కృష్ణారావు, అరవింద్, క్లస్టర్ ఏపిడి శేఖర్, కె.రాజేష్, విజిలెన్స్ టీం, రాజు, నాసిర్, ఎంపీడీఓ కథలప్ప, ఈసీ, టీఏఎస్, ఎఫ్ఏఎస్, పంచాయతీ కార్యదర్శులు, సోషల్ అడిట్ టీం రమేష్ పాల్గొన్నారు.



క్యూ కట్టిన రైతన్న..

## బస్తా యూరియా కోసం పొద్దస్తమానం పడిగాపులు

**చిన్న చింతకుంట, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** వరి పంటకు సరిపడా యూరియా దొరకడం లేదని రైతన్న యూరియా బస్తా కోసం పొద్దస్తమానం ఎరువుల దుకాణాల ముందు పడిగాపులు కాస్తూ తోపులాట మధ్య అవస్థలు పడుతున్నాడు.మంగళవారం మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం ముందు యూరియా బస్తా కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో యూరియా బస్తా దొరుకుతదా లేదా అన్న ఉత్కంఠ నేపథ్యంలో రైతన్న తో పాటు మహిళా రైతులు ఒకరినొకరు తోసుకుంటూ ఇబ్బందులు పడ్డారు.వీరిని అదుపు చేసేందుకు పోలీసులు రైతుల మధ్య నిలబడి నానా ఇబ్బందులు పడ్డారు. ఒక్క యూరియా బస్తా కోసం గంట లకొద్దీ బారులు తీరి పడిగాపులు పడుతున్నాడు.మండలంలోని రైతులే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి రైతులు యూరియా కోసం ఎగబడటంతో ఎరువుల దుకాణాల వద్ద తోపులాట లు చోటుచేసుకుంటున్నాయి.మా వరి పంటకు చివర యూరియా చల్లుదామంటే యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ యూరియా కష్టాలు ఎప్పుడు తొలుగుతా యోనంటూ రైతన్న దిగాలు పడుతున్నాడు.

### మహిళా రైతు పుస్తే మాయం..

**బిజినపల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** యూరియా కోసం వచ్చిన మహిళ రైతు పుస్తె మాయమైన సంఘటన మంగళ వారం చోటుచేసుకుంది. వెల్గొండ తాండ చెందిన మహిళా రైతు రామావత్ లలిత క్యూలైన్లో నిలుచున్న సమయంలో జరి గిన తోపులాటలో పుస్తెలతాడుకు ఉన్న రెండు పుస్తె బిళ్లల్లో ఒకటి పోయింది. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు లలిత తెలిపింది.

## ఆగని అన్నదాతల ఆక్రంధనలు

■ భూత్పూర్ చౌరస్తాలో రైతుల రాస్తారోకో ■ రోడ్డుపైనే భోజనాలు





రాస్తారోకో, ధర్నాలో భోజనాలు చేస్తున్న మహిళా రైతులు

**భూత్పూర్,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త:** యూరియా కోసం భూత్పూర్‌లో రైతులు మళ్లీ రోడెక్కారు.యూరియా కోసం రైతులు ఆక్రంధనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.యూరియా కోసం రైతులు భూత్పూర్‌లో ఇప్పటివరకు నాలుగైదు మార్లు రోడెక్కారు.తమకు యూరియా ఇవ్వాలంటూ మండలంలోనిపలుగ్రామాల రైతులు మంగళవారం భూత్పూర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.దీంతో మూడు గంటల పాటు జరిగిన రైతుల ధర్నా,రాస్తారోకోల వల్ల హైవే స్తంభనేర్పడింది.భూత్పూర్ కూడలిలో రైతులు నిరసనలు,ధర్నా,రాస్తారోకో వల్ల వందలాది వాహనాలు రోడ్డకిరువైపుల నిలిచిపోయాయి. భూత్పూర్ పట్టణంలోని నాలుగు ఎరువుల దుకాణాల వద్ద సరిపోను యూరియా లభించకపోవడంతో రైతులు ఆగ్రహించి రైతులు రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు.ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రైతులుఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు కాచిచివరకు యూరియా దొరక్కపోవడంతో కూడలి వద్దకు చేరుకుని ధర్నా,రాస్తారోకో నిర్వహిం చారు.ఆకలి గొన్న రైతులు మరికొందరు మహిళా రైతులు ఇంటినుంచి తెచ్చుకున్న చద్దీ,టిఫిన్లు రోడ్డుపై కానిచ్చారు.రోడ్డుపై రైతుల ధర్నాతో ఏర్పడిన ట్రాఫిక్ స్తంభనను తొలగించేందుకు భూత్పూర్ పోలీసులు రంగప్రవేశం చేసి రైతుల ధర్నా,రాస్తారోకోను విరమింపజేశారు.

## సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలి

**ఉపాధ్యాయులకు అందాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి: కొత్త శ్రీధర్ రావు**

**ఉప్పునుంతల, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని, ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న బకాయిలను సత్వరమే ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్‌టియు టిఎస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వెల్టూరు, ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొరటికల్, తిరుమలాపూర్, కంసానిపల్లి, గట్టుకడుపల్లి, సద గోడు, మొల్గర, పెద్దాపూర్,లక్ష్మాపూర్, మర్రిపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు)సభ్యత్వాలను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పిఆర్సి రిపోర్టు తెప్పించుకొని ఐదు డిఏలను చెల్లించాల ని, ఏకీకృత సర్వీస్ రూల్స్ 2018 రాష్ట్రపతి ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల మేరకు బోధించాలని, అదేవిధంగా డైట్ లెక్చరర్స్, జేయల్స్, ఎంఈఓ వంటి పర్యవేక్షక పోస్టులను భర్తీ చేయడం సాధ్యం కాదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వద్దె హనుమంత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోకల సతీష్, చంద్రశేఖర్, రవి శేఖర్, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూరు జిపిఓగా రమేష్

**ఉప్పునుంతల, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు సెక్టార్ పరిధిలో గ్రామ పంచాయతీ అధికారిగా రమేష్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించి మంగళవారం వెల్టూరు సెక్టార్‌కు సందర్శించడంతో గ్రామస్తులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. గతంలో మిడ్జిల్ మండలంలో పనిచేసి ఇటీవల ఉప్పునుంతల మండలానికి బదిలీపై రావడంతో స్థానిక తహసిల్దార్ ప్రమీల వెల్టూర్ సెక్టార్ పరిధిలో జిపిఓగా రమేష్ ను నియమించారు. వెల్టూర్ జిపిఓ రమేష్ ను గ్రామస్తులు, అధికారులు ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెల్టూర్ సెక్టార్ జిపిఓ రమేష్‌తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్, ఏఈఓ చిన్యా నాయక్, విద్యుత్ శాఖ అధికారి శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్, స్థానికులు గుద్దటి బాలరాజు, నిరంజన్, లాలుగౌడ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజా పాలన కాదు - విమోచన దినోత్సవం కావాలి

**■ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వీనర్ నాగురావు నామాజీ**

**ఊట్కూర్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మీడి యా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వీనర్ నాగురావు నామాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన పేరుతో ఈ రోజును ప్రభుత్వం నిర్వహించడం తగదని తీవ్రంగా విమర్శించారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడుతూ అనేకమంది అమరులైన విషయాన్ని గుర్తు చేసిన ఆయన ప్రజల తిరుగుబాటు, సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య వల్లే తెలంగాణ నిజాం పాలన నుండి విముక్తి పొందింది. ఈ రోజును తప్పనిసరిగా విమోచన దినోత్సవంగా జరపాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎం.భాస్కర్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, సీనియర్ నాయకులు కుర్వ ఆశప్ప, మాజీ మండల అధ్యక్షుడు రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్ గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, రఘువీర్, వెంకట్రాములు, రోషనప్ప, రణవీర్, తారక్రిష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి ఎల్‌ఐసి పాలసీతో రక్షణ కల్పించండి

**నారాయణపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** ఎల్ఐసి జైత్రయాత్ర క్యాంపెయిన్‌లో భాగంగా నిర్వ హించిన పోటీల విజేతలను సన్మానించే కార్యక్రమంలో హైదరాబాద్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె. సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ ఏజెంట్ మండికి ఆనంద్ విజేతగా ఎంపిక కావడంతో ఆయన ఇంటికే వెళ్లి మహారాజ సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంధ్యారాణి ప్రతి కుటుంబానికి బీమా అవసరం అందరూ ఎల్ఐసి పాలసీ చేయించుకుని భవిష్యత్తు భద్రతను పొందాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్‌రావు, మహబూబ్‌నగర్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మధు కుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, నారాయణపేట బ్రాంచ్ మేనేజర్ రమేష్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ సంగమేశ్వర్, ఎల్ఐఎఫ్ఐ అధ్యక్షుడు బసిరెడ్డి, ఏజెంట్లు నసీర్, వెంకటేష్, ఫజల్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఎస్పీని అభినందించిన జిల్లా ఎస్పీ

**నారాయణపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన 22వ ఓపెన్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో 55 ఏజ్ కేటగిరీ డబుల్స్ విభాగంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్ మల్టీ జోన్1 ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి జట్టు విజయం సాధించారు ఈ సందర్భంగా ఎస్పీ అదనపు ఎస్పీని అభినందిస్తూ విధుల్లో నిబద్ధతతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం పోలీస్ శాఖకు గర్వకారణం యువ పోలీసులకు ఇది స్ఫూర్తిదాయకం అన్నారు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తా

**◆ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధికి తమ కుటుంబం ఎల్లవేళలా అన్ని విధాలా సహకరిస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆడబిడ్డ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. 55వ దేవీ శరన్న వరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మా నించారు.అంతకు ముందు ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, డైరెక్టర్లు మహేష్, ఉజ్వల్ ఉత్సవ కమిటీ అధ్య క్షులు మాచిపెద్ది శివకుమార్, సాయి బాలాజీ సిండికేట్ నిర్వా



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హకులు హకీంరాజేష్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు చంద్రశేఖర్, చందు, రాజయ్య, కిరణ్, బాదం రమేష్, శ్రీనివాసులు, ఆర్యవైశ్య రూరల్ అధ్యక్షులు గంధం ప్రసాద్, మాజీ ఎంపీపీ కోటయ్య, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులుతో పాటు ఆర్యవైశ్యులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కళాశాలలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఓజోన్ పొర పరిరక్షణపై ఆన్లైన్ పరీక్ష మరియు ఉపన్యాస పోటీలను నిర్వహించి ఓజోన్ పరిరక్షణకై 2025 ప్రపంచ ఓజోన్ దినోత్సవం యొక్క థీమ్ సైన్స్ నుండి ప్రపంచ చర్య వరకు అనే నేపథ్యంలో శాస్త్రీయ ఆవిష్కరణలు మాంట్రియల్ ప్రోటోకాల్ వంటి ప్రపంచ విధానం, పరిశోధనలకు ఎలా దోహదపడ్డాయో హైలెట్ చేయడం ద్వారా ఓజోన్ పొరను రక్షించడంలో శాస్త్రీయ పరిశోధన మరియు అంతర్జాతీయ సహకారం యొక్క కీలక పాత్రను నొక్కి చెబుతుందని ఇది ఓజోన్ పొరను మరమ్మత్తు చేయడంలో పురోగతికి దారితీస్తుందంటూ లైఫ్ సైన్సెస్ విద్యార్థులు ఉపన్యసించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణానికి కొన్ని రసాయనాలు మరియు ఉత్పత్తుల హానికరమైన ప్రభావాల గురించి మనకు బాగా సమాచారం ఉండాలి అంటూ భూమి మనకున్న ఏకైక



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన దృశ్యం

ఇల్లు భవిష్యత్ తరాలకు వనరులను నిలబట్టుకోవాల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు.ఆన్లైన్‌పరీక్ష ఉపన్యాసపోటీలలో గెలుపొందిన లైఫ్ సైన్సెస్ విద్యార్థులైన తస్లీమ్ ఫాతిమా, ఎస్. చైతన్య, పి.హారతికి జంతుశాస్త్ర విభాగధిపతి డా.ఎం ప్రవీణ్‌కుమార్ చేతులమీదుగా బహుమతులను ప్రధానోత్సవం చేయడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినులు జంతు శాస్త్ర అధ్యాపకులు బి.శ్రీలత, అదిభాతాజ్, జె.స్వాతి డా.సీహెచ్.శివ ప్రసాద్, వెంకటరమణమూర్తి, డా.బి.మధుసూదన్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఊట్కూర్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** ఊట్కూరు మండల కేంద్రంలో పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలు, దొంగతనాలు, మత్తు పదార్థాల వాడకం, బాల్యవివాహాల నిరోధం, బాల కార్మిక నిర్మూలన, డయల్ 100 వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎస్సై సంజీవ్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు తప్పుడు మార్గాల్లో అమాయకులను మోసం చేస్తున్నారని తెలిపారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వచ్చే అనుమానాస్పద లింకులు,ఫైల్స్ ఓపెన్ చేయరాదని, అపరిచితులతో పరిచయాలు పెట్టుకోవద్దని సూచించారు."మీ కుమారుడు/కూతురు కస్టడీలో ఉన్నారు, కేసు లేకుండా వదిలేస్తాం, డబ్బు పంపండి" అంటూ వచ్చే మోసపూరిత కాల్స్‌కు భయపడవద్దని, ఏ పోలీస్ గాని మరే ఇతర దర్యాప్తు సంస్థగాని డబ్బులు అడగవని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని,ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.



అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

వాట్స్ అప్ గ్రూపుల్లో అనవసర ఫార్వర్డ్ మెసేజ్‌లు, అనుమానిత లింకులు పోస్ట్ చేస్తే గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామాలలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలనిసూచించారు.కార్యక్రమంలో ఉట్కూరు పోలీసులు మహేష్, విజయ్, నిహారికతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదోడి ఇంటి కల సాకారం

■ కాంగ్రెస్ నాయకులు ■ లబ్ధిదారుల ఖాతాలో లక్ష రూపాయలు జమ

**నవాబుపేట, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదోడి ఇంటికల సహకారం అవుతుందని కొండాపూర్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జడ్చర్ల నియోజకవర్గం శాసన సభ్యులు అనురుధ్‌రెడ్డి ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసి దిగ్విజయంగా బేస్మెంటు పూర్తిచేసిన ఏడుగురి లబ్ధిదారులకు 1 లక్ష రూపాయల మొదటి విడతగా వారి ఖాతాలో జమయ్యాయని అందుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డికి లబ్ధిదారులుగ్రామ కాంగ్రెస్‌నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో 21 ఇందిరమ్మ ఇండ్లు ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు కాగా ఇందులో భాగంగా బేస్మెంటు పూర్తి చేసిన 7గురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒక్క లక్ష రూపాయల చొప్పున ఈ కింద తెలిపిన లబ్ధిదారులకు రావడం జరిగింది. అందులో బిచ్చపు జ్యోతి, కావటి యాదయ్య, కొత్త గొల్ల యాదమ్మ, బస్సులగోపాల్, బలుసుల అనిత, దోరేమోని లక్ష్మి, పసుపుల సువర్ణలకు వీరందరికీ మొదటి విడత ఒక లక్ష రూపాయల బిల్లు రావడం జరిగింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం10 సంవత్సరాలు అధికారంలో ఉండి నిరుపేదలకు ఏ ఒక్క సాయం



అనిరుధ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు

చేయలేకపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు కూడా కాలేదు ఎన్నో అభివృద్ధి పథకాలు ఇందిరమ్మ ఇల్లు రుణమాఫీ ఉచిత కరెంటు ఉచిత సన్న బియ్యం ఉచిత బస్సు సౌకర్యం అతి త్వరలోనే బతుకమ్మ చీరల పంపిణీ ప్రతి ఒక్క మహిళకు రెండు చీరలచొప్పున ఇవ్వడం జరుగుతుందని ఇలాంటి పథకాలు ప్రజల లోపల ఎంతో ఆనందం వ్యక్తం చేస్తు ఇంకా ఎన్నో పథకాలకు శ్రీకారం చుడుతున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ఆటలు సరికాదు

**పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్**

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా,విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడడం సరి కాదని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ అన్నారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో పిడిఎస్‌యు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఉచిత విద్య భావాన్ని పాలకవర్గ పార్టీలు అర్థం చేసుకోవాలి అన్నారు.15 లక్షల విద్యార్థుల జీవితాలకు ప్రత్యక్ష సంబంధం కలిగిన అంశంపై ప్రభుత్వం వేగంగానిర్ణయం తీసుకోవాలి.విద్యార్థులు జీవితాలపై ప్రభావం చూపే స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల పై గత ప్రభుత్వ సాకుతో రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. తెలంగాణలో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పథకం మీద ఆధారపడిన విద్యార్థుల విద్యా భవిష్యత్‌ను గాలిలో దీపా





మాట్లాడుతున్న పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్

లుగా మార్చరని అన్నారు. ప్రైవేట్ డిగ్రీ , ఇంజనీరింగ్ ,నర్సింగ్ కాలేజీల యాజమాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురై కళాశాలల బందుకే పిలుపునిచ్చిన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్నది అన్నారు. 8600 కోట్ల బకాయిలు పెండింగ్లో ఉంటే, కేవలం 600 కోట్లుమాత్రమే విడుదల చేస్తామనడం సరైనది కాదని, విద్యార్థుల కోణంలో ఆలోచించి రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా పెండింగ్‌లో ఉన్న 8600 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నాయకులువెంకటేష్, మహేష్, సురేష్, రాజు , గణేష్, అనూష, రమేష్, పరశురామ్, పౌర్ణమి, మహేష్, సుధాకర్, దత్తు, అనురాధ, శివకుమారి, అభినేష్, మైపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ డిసిసి అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**నారాయణపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలోని అభినందన గార్డెన్ లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు కుంభం శివ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున హర్షోల్లాసంగా నిర్వ హించబడ్డాయి. ఈ వేడుకలకు స్థానిక శాసన సభ్యురాలు ఆయన మేనకోడలు పర్ణిక రెడ్డి, మేనల్లుడు అభుజయ రెడ్డి ఆధ్వర్యం వహించగా మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శివన్న సైన్యం టీమ్ సభ్యులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సవ వాతావరణం సృష్టించారు. పరిచయం ఆహ్వానం కార్యక్రమాలతోఆరంభమైన వేడుకలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మాట్లాడుతూ శివకుమార్ రెడ్డి పార్టీ ప్రజా సేవలోనూ కమ్యూనిటీ సమస్యల పరిష్కారంలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన కృషి ఫలితంగా నారాయణపేట పట్టణంలో నీటి సమస్య లేకుండా పరిష్కారంలభించింది అని పేర్కొన్నారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపూత పథకంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు 20లక్షల రూపాయలను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రైతుల సంక్షేమమే కోసం సాగుతాగునీటి సమస్య రేపటి తరాలకు ఉండకూడదని రైతులు కళ్ళలో సంతోషం చూడడానికి దేనికైనా



మాజీ డిసిసి అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కృషి చేస్తాడని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల భాగంగా డప్పు మేళాలు వాద్యకళా ప్రదర్శనలు నిర్వహించి వేదికను ఉత్సాహభరితంగా మార్చారు గజమాలలు, శాలువలతో శివకుమార్ రెడ్డిని ప్రత్యేకంగా సత్కరించగా అభిమానులు కార్యకర్తలు పూలమాలలు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలో పార్టీ వర్గాల మధ్య అనురాగం ఐక్యత ప్రతిఫలించిందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**■ వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి**

**వెల్దండ, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** మండల స్థాయి క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో, ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను మంగళ వారం మండల విద్యాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, సింగిల్ విండో డైరెక్టర్ మట్టవెంకటయ్య గౌడ్ క్రీడాకారు లను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీధర్‌నోడల్ ఆఫీసర్ రవీందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలంలోనివివిధ ఉన్నత పాఠశాలల నుండి సుమారుగా 250మందివిద్యార్థులు పాల్గొన్నారు. డివిజన్ స్థాయికి కబడ్డీలో 40మంది, ఖోఖోలో44, మంది వాలీబాల్‌లో 32 మంది మొత్తం 120 మంది ఎంపికయ్యారు.ఈ ఎంపిక కాబడిన విద్యార్థులంతా త్వరలో కల్వకుర్తి డివిజన్ స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారనిఎంఈఓ తెలిపారు.కార్యక్రమంలో మోడల్ ప్రిన్సిపల్ శ్రీధర్, జిహెచ్ఎం రవీందర్‌తోపాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

## వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ

**వెల్దండ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని అభివృద్ధి తన ధ్యేయమని నాయకులు కాయితి యాదవరెడ్డి అన్నారు.మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో యాదవరెడ్డి తన సొంతంగా వడ్డెర బస్తీ కాలనీలో ఒక లక్ష 50వేల రూపాయలతో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గ్రామ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామంలో అనారోగ్యనికి గురైన కాటిక బలరాంను పరామర్శించి రూ.3వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఏ అవకాశం వచ్చినా బరిలో నిలిచి గెలిచి అభివృద్ధి పరుస్తానన్నారు. కార్యక్రమంలో పోలే రాజు, గోవర్ధన్, రాజశేఖర్, వెంకటయ్య,అశోక్,జంగయ్య, శ్రీను,అర్జున్, శంకర్, రాఘవేందర్ తో పాటు తదితరులు ఉన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

**నారాయణ పేట, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం ప్రకటించి అమరుల జ్ఞాపకార్థం పాఠంశంలో కుటుంబ సాయ సంక్షేమ ప్రాధాన్యతలు కల్పించాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను గుర్తించి వారి చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని అమరుల కుటుంబాలను ఆదుకోవాలని ఉద్యమకారులకు ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

**ఇటిక్యాల సెప్టెంబర్16, ప్రభాతవార్త:** జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్ధప్ప ఆదేశాల మేరకు మండల పరిధిలోని పుటాన్ దొడ్డి గ్రామంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇటిక్యాల ఆసుపత్రి డాక్టర్ రాధికసహకారంతో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళ వారం టిబిముక్త్ భారత్ అభియాన్‌కార్యక్రమంలో భాగంగా పలువురికి వివిధ పరీక్షలు ఎక్సరేల తీసే కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా పలువురికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఇందులో 60 సంవత్సరాల పైబడిన వారు బరువు తక్కువ ఉన్నవారు అలాగే పొగ. మద్యపానం సేవించే వారు అలాగే ఇప్పటికే టీబీ పేషెంట్స్. హైరిస్క్ ఏరియాలో ఉన్నవారికి, రక్తపోటు మరియు డయాబెటిక్ ఉన్నవారిని గుర్తించి వారికి ఎక్సరే పరీక్షలు టీ.బి. స్పూటం, బి.పి. మరియు ఇతర రక్త పరీక్షలు నిర్వహించగా గ్రామంలో 60 మంది ఓపి నమోదు చేసుకోగా వీరిలో 5 గురికి టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని అలాగే మరో 11 మందికి శరీరంలో ఇతర భాగాల ద్వారా కూడా టీబీ వ్యాధి లక్షణాలను గుర్తించినట్లు టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీబి ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదిక్, టీబి నోడల్ పర్సన్ ప్రభాకర్. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు. ఎస్ టి ఎస్ విజయ్. ఏఎన్ఎంలు సౌభాగ్యవతి, కృష్ణమ్మ. టిబి అలర్ట్ ఇండియా టీం డీపీసీ వెంకటేశ్.ఎక్సరే కోఆర్డినేటర్ ఉదయ్,ఆశ కార్యకర్తలు.శారదమ్మ.జ్యోతి,సుజాత,భారతి,రాధా పాల్గొన్నారు..

## నివాస గృహాలకు దూరంగా కారం, పిండి గిర్ని యంత్రాలను ఏర్పాటు చేయాలి

**ఇటిక్యాల సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** ఉమ్మడి మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో నివాసగృహాల మధ్యలో ఏర్పాటుచేసిన కారం. పిండి గిర్ని యంత్రాలను ఇళ్లకు దూరంగా యజమాని ఏర్పాటు చేసుకునేలా ఆదేశించాలని క్రితం జిల్లా పంచాయతీ అధికారి స్థానిక మండల పంచాయతీ అధికారి. మరియు గ్రామ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఫిర్యాదుదారుడు బీచుపల్లి నాయుడు తెలిపారు. దాదాపు 2 సంవత్సరాలుగా ధర్మవరం గ్రామంలో నివాసగృహాల మధ్య కారం పిండి గిర్ని యంత్రం నడుపుతుండగా ఈ యంత్రం 15 హెచ్.పి సామర్థంతో పని చేస్తుండగా సమీప నివాస గృహాల వారికి శబ్ద కంపనాలు. శబ్ద కాలుష్యం.కళ్ళలో మంటలుఅలాగే ఇళ్లలో విద్యుత్తు హెచ్చుతగ్గులు. టీవీ. ఫ్యాన్ లు కాలిపోవడం వంటివి చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదుదారుడు బీచుపల్లి నాయుడు ఇప్పటికే మానవ హక్కుల కమిషన్.ప్రజావాణిలోజిల్లా కలెక్టర్.ఆర్డిఓ. తహసిల్దార్. ఎంపీడీవో. ఎంపీఓ లకు ఫిర్యాదుదారుడు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. విచారణ చేపట్టి నివేదిక ప్రకారంపై వాటి వల్ల నివాస గృహాల వారికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను దూరంగా కారం.పిండి గిర్ని యంత్రాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలని స్థానిక పంచాయతీ అధికారులకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు ఇచ్చినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు.

## జిల్లా వ్యవసాయ అధికారికి అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకుల వినతి

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** రైతులకు సరిపడ్డా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కు అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ముందస్తు వర్షాలకు రైతులు అధిక మొత్తంలో పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. సకాలంలో యూరియావేస్తేనే పంటలు ఏపుగా పెరిగి సరిపడినంత దిగుమతి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో విఫల మైందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తొమ్మిది లక్షల 80వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా కేవలం ఐదులక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసిందన్నారు. మిగతా మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయకపోవడంతో రాష్ట్ర రహితంగానికి యూరియాఅంధక తీవ్రమైన ఇబ్బందులకుగురవుతున్నారు అన్నారు. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, కోఆపరేటివ్ సొసైటీల చుట్టూ, యూరియా కేంద్రాల చుట్టూ రైతులు రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారన్నారు. అన్నం పెట్టే అన్నదాత అనుక్షణం కష్టాలు తప్పడం లేదన్నారు. రైతాంగ డిమాండ్ అనుకూలంగా కొరత లేకుండా యూరియాని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నారెడ్డి, కొండ నరసింహులు, బి.నారాయణ, వెంకట రాములు, కనకప్ప, బసప్పతో బాటు తదితరులు ఉన్నారు.



## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**- బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్**

**జడ్చర్ల, సెప్టెంబరు16, ప్రభాతార్త:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ అన్నారు. జడ్చర్ల మండల కేంద్రం లోని పార్టీ పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం నవాబులు చేసిన అకృత్యాలు, అరాచకాలను ప్రజలకు తెలియచేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని, సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ ప్రకటించి ఆనాటి సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్య పుస్తకాల్లో ప్రచురించి నేటి తరానికి వారి పోరాటాన్ని తెలుపాలన్నారు. మోదీ జన్మదినం సెప్టెంబర్ 17ను మొదలుకుని అక్టోబర్ 2 గాంధీ జయంతి, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని 15రోజులపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు అమర్ నాథ్‌గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ఎస్సీ మోర్చా టౌన్ అధ్యక్షుడు జగదీష్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌చ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, మల్లేష్, సాయి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్ల జీతాల తగ్గింపుకు నిరసన

**మొదటి పేజీ తరువాయి భాగం**

మాట్లాడుతూ కార్మికుల వేతనాలకు వచ్చేసరికి ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా ఉన్న వేతనాల్లో కోత విధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు ఎంపీలు ఇష్టానుసారంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వారిపై ఎవరు నియంత్రణ లేదని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు నల్లవెల్లి కురుమూర్తితో పాటు సురేష్, జగదీష్, గణేష్, అనసూయ, లక్ష్మి, పద్మ, అంజమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్వాతంత్ర్యానికి 77 ఏళ్లు..!

**మొదటి పేజీ తరువాయి భాగం**

సాయన్న తదితరులు రజాకార్ల రావణకాష్టకు బలయ్యారు. రజాకార్ల తుపాకులకు 11మంది పిట్టలు రాలినట్లు నేలకొరిగారు. వీరంతా రావి చెట్టుకింద సమావేశం కాగా, రజాకార్లు విక్షణారహితంగా కాల్పులు జరిపి అమాయక రైతులు, ప్రజల్ని పిట్టల్ని కాల్చినట్లు కాల్చిచంపారు. రజాకార్ల రావణ కాష్టకుపరాకాష్టగాఅప్పంపల్లిలోని రావిచెట్టు సజీవసాక్ష్యంగానిలిచిందని చెప్పాలి. భారత ఉపప్రధాని, రక్షణశాఖ మంత్రిసర్దార్‌వల్లభ్‌భాయి పటేల్ చొరవతోభారతదేశంలోని సంస్థానాలన్ని భారతయూనియన్లలో కలిశాయి. నిజాంనిరంకుశ పాలన అంతమై తెలంగాణ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు.

## రాజకీయాలు కాదు.. విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం

**మొదటి పేజీ తరువాయి భాగం**

అంతే కాకుండా ఐఐటి కళాశాలను సైతం మహబూబ్‌నగర్‌కు తీసుకురావడంలో సఫలీకృతం కావడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో ఫార్మసీ, అగ్రికల్చర్, ఎంబిఎ లాంటి ఎన్నో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలను మన పిల్లల భవిష్యత్తు కోసం తెస్తామన్నారు. మన మహబూబ్ నగర్ బిడ్డ అనన్య రెడ్డి సివిల్ సర్వీసెస్ లో దేశంలోనే మూడవ ర్యాంకును సాధించిందని ఆయన గుర్తు చేశారు. మీ పిల్లలు కూడా అలాంటి లక్ష్యాలను చేరుకుంటే చూడాలని తనకు ఉందన్నారు. మీ పిల్లలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిస్తే వారికి మంచి భవిష్యత్తు ఇచ్చే బాధ్యత మేము తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు 114 మందికి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మరియు ఫార్మసీ లలో సీట్లు ఉచితంగా పొందారని ఆయన గుర్తు చేశారు. తాను రాజకీయాలకోసం ఈ కార్యక్రమం చేయడం లేదని స్పష్టం చేశారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ లోని 119 నియోజకవర్గాల్లో కాని, దేశంలోని ఏ నియోజకవర్గం లో గాని ఇలాంటి సామాజిక స్పృహ కలిగిన నాయకుడు కనిపించలేదని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ తన కుటుంబ సభ్యులు అన్నట్లుగా వారి బాగోగులు చూసే ఇలాంటి ఎమ్మెల్యే మన మహబూబ్‌నగర్‌కు లభించడం అదృష్టం అని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిఎంఓ బాలు యాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, రామకృష్ణ మఠం నిర్వాహకులు రాజమల్లేష్, వివిధ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నలుగురిపై 30 మంది విద్యార్థులు దాడి

**మొదటి పేజీ తరువాయి భాగం**

ఒక ఆసుపత్రిలో చికిత్స అందించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థులపై దాడి ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో వారు వివరాల సేకరణకు గురుకుల పాఠశాలకు చేరుకొని సంఘటనకు కారణమైన విద్యార్థులకు టీ.సి.లు ఇచ్చి పంపించారు. అనంతరం స్థానిక ఎస్సై బి.నాగన్న పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు కౌన్సిలింగ్ చేశారు. పాఠశాలలో క్రమ శిక్షణతో మెలగాలని మరొకసారి ఇలాంటి చర్యలు జరగకుండా జాగ్రత్తగా మెలగాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా మహబూబ్‌నగర్ నుంచి షీ టిమ్ కూడా సంఘటనపై ఆరా తీశారు.

## ఓటు బ్యాంకు కోసమే విమోచన దినాన్ని నిర్వహించడం లేదు

**వనపర్తి రూరల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు విమోచన దినోత్సవం అధికారికంగా జరుపుతామన్న బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారంలోకి వచ్చాక ఓటు బ్యాంకు కోసమే విమోచన దినాన్ని నిర్వహించడం లేదని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మంగళవారం బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ ఆగస్టు 15, 1947న దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణ మాత్రం నిజాం నియంతృత్వం రజాకార్ల ఆకృత్యాల మధ్య వందేమాతరం ఉచ్చారణ నేరమై జాతీయ జెండా నిషేధానికి గురైందని, ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకర్లు మనుషులను వరుసలో నిలబెట్టి కాల్చి చంపడం, చెట్లకు కట్టి సామూహికంగా ఉరి తీయడం, మహిళలచే నగ్నంగా బతుకమ్మలాడించడం, హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొమ్మిలు నిజాం రాజ్యంలో ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించారని విమర్శించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జడ్చర్లలో రక్తదానం శిబిరం

**జడ్చర్ల, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం జడ్చర్లలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మోడీ 75వ జన్మదినం సందర్భంగా 75యూనిట్ల రక్తంసేకరించేందుకు ఏర్పాట్లు చేశామని, ప్రధానిమోడీ అభిమానులు, బీజేపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తు పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఇంజనీరింగ్ కాలేజ్ హెచ్‌ఓడిగా పండుగ రామరాజు

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** పండుగ రామరాజు ను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విభాగాధిపతిగా నియమిస్తూ పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పి. రమేష్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ పండుగ రామరాజు ఉస్మానియా యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ, బిట్స్ పిలానీలో పీహెచ్డీ మరియు ఐఐటి మద్రాస్ లో పోస్ట్ డాక్టోరల్ ఫెలో గా పనిచేశారు . డాక్టర్ పండుగ రామరాజు ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ వైస్ ఛాన్సలర్ పాలమూరు విశ్వవిద్యాలయం గారికి మరియు ప్రొఫెసర్ పి రమేష్ బాబు రిజిస్టర్ పాలమూరు విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్ చంద్రకిరణ్ డైరెక్టర్ అకాడమిక్ ఆడిట్ సెల్ ప్రిన్సిపల్ ఇంజనీరింగ్ కాలేజ్ పాలమూరు విశ్వవిద్యాలయం గారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాన్ టీచింగ్ సాయి కిరణ్, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

## మహిళలను కోటీశ్వరులను చేస్తాం: ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** తెలంగాణ ఇందిరా మహిళా శక్తి, మత్స్యశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నీలి విప్లవ పథకం కింద సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన మహిళలకు చేపల విక్రయ వాహనాలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల మధ్యే ఉండి వారి అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణలో చేపల ఉత్పత్తిని విస్తృతంగా పెంచి, ఇతర రాష్ట్రాలకు మాత్రమే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి చేసే స్థాయికి మత్స్యశాఖను తీసుకు వెళ్లడం మా లక్ష్యమన్నారు. ఈ దిశగా మహిళల సాధికారతకు, మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు గారు, మాజీ కౌన్సిలర్స్ తదితరులు ఉన్నారు.

# విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

**◆ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి**

**బిజినపల్లి, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీ మల్లురవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి లతో కలిసి ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటుచేసిన మినరల్‌వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఎంపీ మల్లురవి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యా అందించి పిల్లల బంగారు భవిష్యత్తు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ మట్టిలో మాణిక్యాల రాణించి విద్యార్థులు తల్లిదండ్రులకు చదివిన పాఠశాలకు గుర్తింపు తేవాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారని గుర్తు ఎరగాలని చెప్పారు. ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు దీటుగా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు పేద సామాన్య మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా అద్భుతమైన మానవ వనరుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని, మీపై పెట్టుకున్న కలలను నిజం చేయడానికి ప్రతి నిమిషం ప్రతిక్షణం తపస్సు లాగా చదువుకొని మీ లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా డిసిసిబి చైర్మన్ మావిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ రాజేందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, తహసిల్దార్ మునీరుద్దీన్, పాఠశాల ప్రిన్సిపల్ సుమతి, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ కే రాకేష్ వర్మ, మేనేజర్ నవీన్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఫరూక్ బాషా, స్థానిక నాయకులు రాములు అమృత్ రెడ్డి వెంకట్ స్వామి, కేటి తిరుపతయ్య మాన్య నాయక్ రామ్‌చందర్, ముక్తార్‌పాషా, చంద్రగౌడ్, నరేందర్‌గౌడ్ , సైదులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

## విద్యార్థుల శారీరక మానసిక ఎదుగుదలకు కృషి చేయాలి

**◆ అంగన్‌వాడీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత ◆ అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

**ఉప్పునుంతల, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే ప్రతి విద్యార్థి శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలతో కూడిన బలవర్థకమైన పౌష్టికారాన్ని అంగన్‌వాడి కార్యకర్తలు అందించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. మంగళవారం ఐసిడిఎస్ బల్మూరు ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతల, బలమూరు, లింగాల మండలాలకు చెందిన అంగన్‌వాడి లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని సీతారాంపూర్ స్టేజి వద్ద ఉన్న రైతు వేదికలో అంగన్‌వాడీలకు పోషన్ బీ, పడాయి బీ పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా అంగన్వాడీ టీచర్లకు డ్రెస్ కోడ్ కింద (చీరలు) పంపిణీ చేశారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమంలో బల్మూరు ప్రాజెక్టు సిడిపిఓ దమయంతి మాట్లాడుతూ పోషన్ బి ,పడాయి బి అనే అంశంలో భాగంగా బాల్యారంభ అభివృద్ధితో పాటు విద్యారంభాభివృద్ధి జరగాలని అందుకు అందరూ కృషి చేయాలన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు భవిష్యత్తు సమాజానికి మంచి పౌరుల అందించేందుకు బాల్య దశలోనే వారికి నాణ్యమైన ఆహారం అందించి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు గ్రామస్థాయిలో ఉండే చిన్నారుల నుంచి గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలకు నాణ్యమైన, మెరుగైన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న అన్నిరకాల సదుపాయాలను లబ్ధిదారులకు అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఐసిడిఎస్ బల్మూరు ప్రాజెక్టు సిడిపిఓ ధమయంతి, స్థానిక నాయకులు జేపీసీ అధ్యక్షుడు కాశన్న యాదవ్, మాజీ సర్పంచి రాంప్రసాద్‌గౌడు, సూపర్‌వైజర్లు బిపాషా, నిర్మల, గిరిజ, సునీత, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ పార్వతి ఉప్పునుంతల, బల్మూరు, లింగాల మండలాల అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

## ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేసిన మోటార్ వెహికల్ అధికారులు

**అలంపూర్ సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని జోగులాంబ గద్వాల జిల్లా ఆర్టీవో అధికారులు బుధవారం రోజు 18 బస్సులను సీజ్ తనిఖీ చేయగా 8 బస్సుల పైన కేసులు నమోదు చేసారు. స్కూల్ బస్సులకు వివిధ రకాలైన అనుమతులు పర్మిషన్లు లేకపోవడంతో తనిఖీలను ముమ్మరంగా నిర్వహించి ఆయా మండలాలలోని ఉన్న ప్రైవేటు పాఠశాలల స్కూల్ బస్సులోని సీజ్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడంతో కొంత మంది ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అనుమతులు లేని బస్సులను దూరప్రాంతాలకు తరలించి దాచిపెట్టడం జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గ పరిధిలో ప్రైవేటు పాఠశాలలో నిర్వహి స్తున్న యజమాన్యంపెద్ద ఎత్తున ఎలాంటి అనుమతులు లేని బస్సులను నడిపిస్తూ, వివిధ దూర ప్రాంతాల గ్రామాల నుండి విద్యార్థులను తీసుకువచ్చే విధంగా బస్సులను నడిపిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ఆలంపూర్ నియోజకవర్గ పరిధిలో ఐజ, ఉండావెల్లి, పరిసరప్రాంతాలలో పెద్దఎత్తున ఎలాంటి అనుమతులు లేనిబస్సులను నడిపిస్తున్నారానే ఆరోపణలు వస్తున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా రవాణా శాఖ అధికారులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించి బస్సులను ఫీజు చేయడం సంతోషకరమని అలల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రైవేట్ స్కూల్ బస్సును సీజ్ చేస్తున్న మోటార్ వెహికల్ అధికారులు

## కోర్టు వినూత్న తీర్పు..

**- డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన నిందితునికి సామాజిక సేవ**

**- రూ.2వేల జరిమానా**

**జడ్చర్ల, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిపై న్యాయస్థానం వినూత్నమైన తీర్పును ఇచ్చింది. శిక్ష అనేది కేవలం దండన మాత్రమే కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలనే ఉద్దేశంతో, సామాజిక సేవ రూపంలో తీర్పు వెలువరించింది. ఈ తీర్పును మహబూబ్ నగర్ ట్రాఫిక్ పోలీసులు అమలు చేశారు. ఆగస్టు 24న సాయంత్రం బోయపల్లి రహదారిపై ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మోతినగర్‌కు చెందిన వెంకట్రాములు కుమారుడు రాఘవేందర్ మద్యం సేవించి మోటర్ సైకిల్ నడుపుతూ పట్టుబడ్డాడు. ఈ కేసులో మంగళవారం 2వ తరగతి కోర్టు, స్పెషల్ జడ్జి డి.నిర్మలా నిందితుడికి రెండు రోజుల సామాజిక సేవ తో పాటు రూ.2వేల నగదు జరిమానా విధించారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లలో ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని, దీనివల్ల కలిగే నష్టాలను వివరించాలని ఆదేశిస్తూ శిక్షవిధించారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ఈతీర్పును అమలు చేసి, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిందితుడు సామాజిక సేవ నిర్వహించేలా చర్యలు చేపట్టారు.



ప్లకార్డుతో నిలబడ్డ రాఘవేందర్

## పనులు వేగవంతం చేయాలి

**- నూతన భవన నిర్మాణాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్**

**జడ్చర్ల, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని , పనులల్లో నాణ్యత లోపించొద్దని మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్ పర్సన్ పాలాది సారిక, మున్సిపల్ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం జడ్చర్లలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను వారు కౌన్సిల్ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 15,17,20వ వార్డుల్లో డ్రైనేజీలను పరిశీలించారు. నూతన భవనము త్వరగాఅందు బాటులోకి వచ్చే విధంగా కృషి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.



భవనాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, సభ్యులు

## నేరాలపై కఠిన చర్యలు

**◆ పారదర్శక విచారణ ద్వారా శిక్షల శాతం పెంచాలి**

**◆ మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి**



మాట్లాడుతున్న ఎస్పీ జానకీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మహ బూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ డి.జానకి పాల్గొని పోలీసు అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసునూ పారదర్శకంగా, లోతైన విచారణతో ముందుకు తీసుకెళ్లాలని, తద్వారా నిందితులకు శిక్షలు పడేశాతంపెరగాలని ఆదేశించారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, యూఐ కేసులు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులు వంటి అన్ని కేసులను విపులంగా సమీక్షించి, వాటి పరిష్కారం కోసం తగిన మార్గదర్శకాలుఅందజేశారు. కోర్టు విచారణలపై దృష్టి కంటెస్టెడ్ కేసుల్లో సాక్షులను పకడ్బందీగా బ్రీఫ్ చేయాలని, బాధితులకు కేసుల పురోగతిని తెలియజేయాలని సూచించారు. శిక్షలశాతం మరింత పెరగాలని పేర్కొన్నారు. మహిళలపై నేరాలు, ముఖ్యంగా పోక్సో కేసుల్లో, పోలీసులు మరింత కృషి చేయాలని ఆమె స్పష్టంగా ఆదేశించారు. సమీక్షా సమావేశంలోఅదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, రూరల్ సీఐ గాంధీ నాయక్, జడ్చర్లటౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, భూత్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, వుమెన్ పీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ రత్నం పాల్గొన్నారు.

## రేపు చికెన్ వ్యర్థాల టెండర్లు

**జడ్చర్ల, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని చికెన్/మటన్/చేపల షాపులనుంచి 2025-26 సంవత్సరానికి తేది 14.09.2025 నుంచి 13.09.2026 వరకు వచ్చే వ్యర్థాలను తీసుకొనుటకు గాను పురపాలక చట్టం - 2019 ను అనుసరించి ఈనెల11న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయుదా వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తిరిగి వేలాన్ని ఈనెల 18న గురువారం ఉదయం 11.00గంటలకు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిఒక ప్రకటనలో తెలిపారు. కావునా దరఖాస్తుదారులు సంబంధిత వివరాలతో బహిరంగ వేలములో పాల్గొనాలని సూచించారు.

## పియు స్నాతకోత్సవానికి కలెక్టర్‌కు ఆహ్వానం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పాలమూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పి రమేష్ బాబు పాలమూరు విశ్వవిద్యాలయంలో జరిగే నాలుగవ స్నాతకోత్సవానికి హాజరు కావాలంటూ కలెక్టర్ విజయేందిర బోయికి వినతి పత్రం అందజేశారు. ఈమేరకు మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఆమెను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ పాలమూరు విశ్వవిద్యాలయంలో జరిగే నాలుగో స్నాతకోత్సవానికి హాజరవుతానని తెలిపారు.

## కొత్తూరులో వైద్య శిబిరం విజయవంతం

**మిడ్జిల్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** మిడ్జిల్ మండలం, కొత్తూరు గ్రామంలో చేయూత రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చైర్పర్సన్ మార్త డేవిడ్ ఆధ్వర్యంలో ఎస్వీఎస్ హాస్పిటల్ వైద్య బృందం సౌజన్యంతో శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బాదేపల్లి మార్కెట్ చైర్పర్సన్ తంగెళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఈ విధమైన వైద్య శిబిరాలు ఎంతో అవసరమని గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారన్నారు ఎస్వీఎస్ హాస్పిటల్ వైద్యులు సేవలను మరువలేని అని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి 350 మంది షుగర్, బిపి, రక్త పరీక్షలు, డెంటల్, కళ్ళ పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. శశాంక్ (జర్నల్ మెడిసిన్) డా. అనీష్‌కుమార్, డా. సాయి కిరణ్, డా. అనన్య, డా. వసుధ, డా. సాయిప్రసన్న, డా. శిరీష, డా. దీపిక, డా. దివ్య, డా. సదాశివ వైద్య శిబిరానికి సహకరించిన ఎన్నం సత్యనారాయణ గుప్తా, గ్రామస్తులురాములు, కృష్ణయ్య, అభిలాష్ రెడ్డి, మల్లేష్, మహేష్, బాల్రెడ్డి నరేష్, వెంకట్రెడ్డి, బాల నారాయణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**మిడ్జిల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా నిర్వహించిన వినోద్‌కుమార్‌ను గ్రామస్తులు ఉపాధ్యాయులు విద్యార్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన క్రమ శిక్షణను అందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత మరువలేనిదని కొనియాడారు. పదోన్నతి బదిలీపై జడ్పీహెచ్ఎస్ లింగంపల్లి స్కూల్ అసిస్టెంట్గా వెళ్లడం ఎంతో సంతోషం అని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయున్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, శ్రావణి, విజయ భాస్కర్, గ్రామస్తులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**రిహార్సల్స్ తనిఖీ చేసిన అదనపు ఎస్పీ**

**నారాయణపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 17న జరగనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో సెర్మోనియల్ గార్డ్ రిహార్సల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్ రిహార్సల్స్ తనిఖీ చేసి ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐలు శ్వేత, కృష్ణ చైతన్య, శిరీష, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

**భూత్పూర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** బుధవారం భూత్పూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠ శాలల క్రీడల నిర్వహణ కోసం బుధవారం నుంచి ఎంపికలు జరుగనున్నాయి. ఈ నెల 17న కబాడీ, ఖోఖోలు, 18న వాలీబాల్ క్రీడల కోసం ఎంపికలు నిర్వహించనున్నట్లు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు గజానంకుమార్, రమేష్‌కుమార్‌లు తెలిపారు. 14నుంచి 17ఏళ్ల మధ్య వయస్సున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, గురుకులాలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ప్రతీ విభాగంలో నలుగురేసి విద్యార్థులకు మాత్రమే ఎంపికలో అవకాశముంటుందని పేర్కొన్నారు. సెలెక్షన్స్‌లో పాల్గొనే విద్యార్థులు బోనాఫైడ్ లేదా బర్త్ సర్టిఫికేట్లతో సెలెక్షన్లకు హాజరుకావాలని వారు కోరారు. ఇతర వివరాలకు 9440765228, 9440160104 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు

**జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్**

**వనపర్తి రూరల్, సెప్టెంబరు16 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 20 నుంచి 22 వరకు 11వ సీనియర్ ఇంటర్ డిస్టిక్ సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వనపర్తి జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షులు బండారు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖమంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనరెడ్డి ఈపోటీలను ప్రారంభిస్తారని అన్నారు. పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని గతంలో ఉన్న పది జిల్లాలోని క్రీడాకారులు సుమారు 150 మంది పైగా పాల్గొంటారని సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సెలెక్షన్‌లో ఉమ్మడిజిల్లాకు చెందిన అఖిలేష్ (అమరాబాద్), మహేష్ (కోడేరు), వాసు (వంగూర్), రంగస్వామి (ఐజ), విష్ణు (గద్వాల్) క్రీడాకారులను ఎంపిక చేశారని అన్నారు. సుధీర్ స్పోర్ట్స్ ఆఫీసర్, పిఈడి సురేందర్, పిఈడి భాస్కర్ గౌడ్, స్పోర్ట్స్ ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, భాస్కర్ గౌడ్ రిటైర్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాపర్ల రామ్ రెడ్డి తదితరులు హాజరవుతున్నారని అన్నారు. అవకాశాన్ని వనపర్తిజిల్లా ప్రజలతో పాటు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆర్థిక సహాయం అందజేత

**కల్వకుర్తి, సెప్టెంబర్16 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొత్తల్ల చెన్నయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్ స్పందించి బాధిత కుటుంబానికి రూ.2వేల నగదుతో పాటు 25 కిలోల బియ్యాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. కొత్తల్ల చెన్నయ్య త్వరగా కోలుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శేషిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు మొహమ్మద్ గౌసుద్దిన్, డీలర్ రవి, కాంగ్రెస్ నాయకులు చెదురుపల్లి శ్రీశైలం, మేకల పాండు, రవి, మార్చాల శ్రీనివాసులు, పకృద్దిన్, మేకల స్వామి తదితరులు ఉన్నారు.

## "పోషణ్ భీ-పఢై భీ" పై అవగాహన

**కల్వకుర్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** "పోషణ్ భీ-పఢై భీ" అనేది ఒక భారత ప్రభుత్వ కార్యక్రమమని, దీని అర్థం "పోషణ కూడా, చదువు కూడా" అని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. కల్వకుర్తి పటణంలో ఐసీడీఎస్ కల్వకుర్తి ప్రాజెక్టులో సీడీపీఓ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది భారత ప్రభుత్వం ప్రారంభించిన ఒక ప్రచార కార్యక్రమమని, దీని ముఖ్య ఉద్దేశ్యం పిల్లలలో పౌష్టికాహారం మరియు ప్రారంభబాల్య విద్యను మెరుగుపరచడమన్నారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అంగన్‌వాడీ టీచర్లు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ వనజ, జ్యోతి, రషీదా, అరుణ, శంకర్, వెంకట్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.